"స్వామీ! నన్ను మీ శిష్యుడిగా స్వీకరించి దైవాన్ని కనుగొనే మార్గం నాకు బోధించండి."

అతని వంక పరిశీలనగా చూసి చెప్పాడు ఆ బ్రహ్మజ్ఞాని.

"నువ్వే అది. దేవుడు నీలోనే ఉన్నాడు. అక్కడ వెదుకు."

"ఇది నాకు ఇదివరకే తెలుసు. ఇంకేదైనా బోధించండి."

"నాకు తెలిసిన బోధ ఇదొక్కటే. నీకు ఇంకో బోధ కావాలంటే నువ్వు ఇంకో గురువుని ఆశ్రయించు." చెప్పాడు బ్రహ్మజ్ఞాని.

## 156. నిజమైన సాధువు

తీర్థ యాత్రలకి వెళ్ళే ఓ సాధువు మునిమాపు వేళ ఓ గ్రామానికి చేరుకున్నాడు. ఆ గ్రామం మొదట్లోనే ఓ వేశ్య ఇల్లుంది. ఆయన్ని గమనించి, ఆయన దగ్గర బాగా డబ్బుండచ్చని భావించి, భక్తి నటిస్తూ తన ఇంటికి ఆహ్వానించింది. ఆయన ఆ ఆహ్వానాన్ని మన్నించి ఆమె ఇంటికి వెళ్ళాడు.

"ఆమె వేశ్య అని మీకు తెలీదా?" ఆశ్చర్యంగా ప్రశ్నించారు గ్రామస్థులు మర్నాడు ఆ ఇంట్లోంచి వస్తున్న అతన్ని చూసి.

"తెలుసు. కాని నాకు అక్కడ చాలా సౌకర్యంగా ఉంది." జవాబు చెప్పాడు సాధువు.

ఆ గ్రామంలో ఉన్నంత కాలం ఆ సాధువు ఆమె ఇంట్లోనే బస చేయడమే కాక, అసలు ఇంట్లోంచి బయటికే రావడం మానేసాడు. ఈ విడ్డూరానికి గ్రామస్థులంతా చెవులు కొరుక్కున్నారు.

మూడు రోజుల తర్వాత ఆ ఇంటి తలుపులు తెరుచుకున్నాయి. ఆ సాధువు తన తీర్థయాత్రని కొనసాగించాడు. ఆ నాటినించీ ఆ వేశ్య తన వృత్తిని మానేసి, భగవద్భక్తితో కాలం గడపసాగింది. ఆయన మూడు రోజులు లోపల ఉండి ఏం చేసాడో అప్పటికి కాని గ్రామస్థులకి అర్థం కాలేదు.